ప్రజాశక్తి
గురువారం 27 ఫిబ్రవరి 2025
పార్వతీపురం మన్యం



సిఆర్‌ఎంటిలను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

సమగ్ర శిక్షలో 14 ఏళ్లుగా పనిచేస్తున్న సిఆర్‌ఎంటిలను రెగ్యులర్ చేయాలని సిఆర్‌ఎంటి హక్కుల సాధన సమితి కన్వీనర్ ఎన్.కాంతారావు, ప్రతినిధులు ఎ.పోలినాయుడు, జి.రమేష్, పి.వెంకటరావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో 3319 మంది సిఆర్‌ఎంటిలు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని చెప్పారు. ఎంటిఎస్ ఇచ్చి శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. డిఎస్‌సిలో వెయిటేజ్ ఇవ్వాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌చేశారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి స్థానానికి గురువారం జరుగనున్న ఎన్నికకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాలకు అనుగుణంగా రెవెన్యూ అధికారులు ఎన్నికకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉత్తరాంధ్ర పరిధిలోని ఉమ్మడి విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో 22,493 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగనుంది.

ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం

- నేడు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్
- ఉత్తరాంధ్రలో 22,493 మంది ఓటర్లు.. 123 పోలింగ్ కేంద్రాలు
- పార్వతీపురం మన్యంలో 2333 మంది, విజయనగరం జిల్లాలో 5223 మంది ఓటర్లు
- కేంద్రాలకు తరలివెళ్లిన ఎన్నికల అధికారులు, సిబ్బంది



సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



బ్యాలెట్ పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

జిల్లా	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు
విజయనగరం	5,223	3,270	1,953
మన్యం	2,333	1,574	759
శీకాకుళం	5,035	3,416	1,619
విశాఖపట్నం	5,529	2,539	2,990
అనకాపల్లి	2,885	1,789	1,096
ఎఎస్ఆర్	1,488	920	568
మొత్తం	22,493	13,508	8,985

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధమైంది. గురువారం జిల్లావ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయంలో బుధవారం పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేశారు. తొలుత పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పరిశీలించారు. జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, డిఆర్‌ఒకు పలు సూచనలు చేశారు. మెటీరియల్ పంపిణీలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 15 మండలాల్లో అన్ని పోలింగ్ కేంద్రాలకు మెటీరియల్ పంపిణీ చేసినట్లు చెప్పారు. ఎన్నికల దృష్ట్యా జిల్లాను ఆరు జోన్లుగా విభజించి, సెక్టోరియల్ అధికారుల ఆధ్వర్యంలో వాహనాల్లో పోలింగ్ మెటీరియల్‌తో ఎన్నికల అధికారులు, సిబ్బంది తరలివెళ్లినట్లు తెలిపారు. గురువారం ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రతీ కేంద్రంలో పోలింగ్ జరగనుందన్నారు. జిల్లాలో 2,333 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని, వారంతా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని వెల్లడించారు. ఓటు హక్కును వినియోగించు కునేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేశామని, వారందరికీ ఓటర్ స్లిప్పులను కూడా పంపిణీ చేసినట్లు చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. వికలాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్లు సమకూర్చినట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఎండ తగలకుండా షామియానాలు, తాగునీరు ఏర్పాటు చేశామని వివరించారు.

జిల్లా	పోలింగ్ కేంద్రాలు
విజయనగరం	29
మన్యం	15
శ్రీకాకుళం	31
విశాఖపట్నం	13
అనకాపల్లి	24
ఎఎస్ఆర్	11
మొత్తం కేంద్రాలు	123

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అన్ని చర్యలు చేపట్టామని కలెక్టర్ వివరించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ ముగిసే వరకు జిల్లాలో ప్రత్యేక నిషేధ ఆంక్షలు ఉంటాయని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు పోలింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల పరిధిలో ఐదుగురు మించి గుమిగూడకుండా నిషేధాజ్ఞలు విధించినట్లు చెప్పారు. చట్ట వ్యతిరేకంగా గుమిగూడటం, సభలు, ర్యాలీలు నిర్వహించడం చేయరాదని తెలిపారు. రాజకీయ పక్షాలకు చెందిన పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లు వంటి వాటిపై కూడా నిషేధాజ్ఞలు వర్తిస్తాయని కలెక్టర్ స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, రూట్ అధికారులు, సెక్టోరియల్, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అందరి నోటా.. విజయగౌరి మాట

- గెలుపు ధీమాలో పిడిఎఫ్
- కూటమి మద్దతు తీసుకోవడంపై ఎపిటిఎఫ్‌లో అంతర్మథనం
- గాదె, వర్మలకు విజయగౌరే ప్రత్యామ్నాయం అంటున్న గురువులు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నేడు (గురువారం) జరుగనున్న ఉత్తరాంధ్ర శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయులు, మేధావులు, ఉద్యోగుల నోట పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి మాటే ఎక్కువగా వినిపిస్తోంది. విజయ అవకాశాలు ఆమెకే ఉంటాయన్న విశ్లేషణలు ఊపందుకున్నాయి. పోలింగ్‌కు ఇంకా కొన్ని గంటలు మాత్రమే సమయం ఉండడంతో సమీకరణాలన్నీ విజయగౌరికి మద్దతుగా మారుతున్నాయి. దీంతో, పిడిఎఫ్ మద్దతుదారులంతా గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ ఉద్యమాల్లో యుటిఎఫ్ నాయకురాలిగా విజయగౌరి చూపిన చొరవ, నిజాయితీ, నిబద్ధత, కుటుంబ నేపథ్యం, పిడిఎఫ్ తరపున పోటీ చేయడం ఇందుకు ముఖ్య కారణాలుగా చెప్పుకోవచ్చు. దీనికి తోడు పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ ఎపిటిఎఫ్, పిఆర్‌టియుల్లో అంతర్మథనం మొదలైంది. ఎంతైనా ఉపాధ్యాయులు, వారి సంఘాల మధ్య పోటీ ఉండాలి తప్ప, ఉపాధ్యాయులకు ఇచ్చిన మాట తప్పడమే కాకుండా, నిలదీసిన నాయకులపై నిర్బంధాలు, బెదిరింపులకు పాల్పడిన పార్టీల పంచన చేరిపోవడం సరికాదనే చర్చ రెండు రోజులుగా యావత్తు ఉపాధ్యాయ రంగంలో నడుస్తోంది. ముఖ్యంగా ఎపిటిఎఫ్ తరపున బరిలో నిలిచిన రఘువర్మకు మద్దతుగా టిడిపి నేతలు నేరుగా రంగంలోకి దిగి ప్రచారం చేయడం ఆ సంఘంలోని మెజార్టీ ఉపాధ్యాయులకు మింగుపడడం లేదు. 'ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మనం అధికార పార్టీ మద్దతుతో గెలిస్తే తిరిగి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించగలమా'? అంటూ ఆ సంఘంలో పెద్ద ఎత్తున చర్చ సాగుతున్నట్టుగా సమాచారం. ఈనేపథ్యంలో ఎపిటిఎఫ్‌లో ఎక్కువ మంది ఓటర్లు ఉద్యమాల్లో ఆరితేరిన విజయగౌరివైపు చూస్తున్నారు. అటు ఓటమి తప్పదని భావించిన గాదె శ్రీనివాసుల నాయుడు కులం, ప్రాంతం తెరపైకి తెచ్చారు. ఇది కూడా పిఆర్‌టియులోని చాలా మంది ఉపాధ్యాయులకు నచ్చడం లేదు. ఇలాంటి పరిస్థితులలో గాదె కన్నా విజయగౌరి మిన్న అన్నట్టుగా ఎక్కుమంది భావించారు. తొలి నుంచీ ప్రధానమైన పోటీ ఈ ముగ్గురి మధ్యే ఉంటుందన్న విశ్లేషణలు వెలువడినప్పటికీ తాజాగా పరిణామాలు విజయగౌరికి మరింత సానుకూలంగా మారాయి. మిగిలిన ఏడుగురు అభ్యర్థులు పెద్దగా ప్రభావితం చేసే అవకాశం లేకపోవడంతో ఆమె గెలుపు సునాయాశం అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.



మహాశివరాత్రి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలు బుధవారం కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. శివాలయాల్లో క్యూలైన్లలో ప్రజలు భారీగా బారులు తీరారు. పారమ్మకొండ, గుంప, అడ్డాపుశీలలోని శైవక్షేత్రాల్లో రద్దీ ఎక్కువగా కనిపించింది. కొమరాడ మండలం గుంప సోమేశ్వర ఆలయానికి నదిలో దిగి వెళ్తున్న యాత్రికులను పైచిత్రంలో చూడొచ్చు

చిరుధాన్యాల వినియోగంతోనే ఆరోగ్యం

ఆప్కాబ్ జిఎం జివిఎన్ రాజు

ప్రజాశక్తి - కురుపాం, గుమ్మలక్ష్మీపురం

చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యంగా ఉంటామని ఆప్కాబ్ జనరల్ మేనేజర్ జి.వి.ఎన్ రాజు అన్నారు. కురుపాం మండలం కొండబారిడి, గుమ్మలక్ష్మీపురం మండలం రేగిడి గ్రామాల్లో నాబార్డు ఆర్థిక సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో చేపడుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని, వెలుగు సంస్థ విడివికెల ద్వారా చేపట్టిన చిరు ధాన్యాల బేకరీ ఉత్పత్తుల కేంద్రాలను బుధవారం ఆయన ఆధ్వర్యాన ఆప్కాబ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా చిరుధాన్యాల పంట ఉత్పత్తి, వినియోగం, విలువ హెచ్చింపు, తదితర కార్యక్రమాల వివరాలను బేకరి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. బాతుగుడబలో అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో నిర్మించిన చెక్ డ్యామ్‌ను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతుల పంటలను నిల్వ చేసుకునేందుకు తక్కువ రుసుంతో కో-ఆపరేటివ్ బ్యాంకు గోడౌన్లను వినియోగించాలని సూచించారు. ప్రాసెసింగ్ యూనిట్లకు తక్కువ వడ్డీకి కోఆపరేటివ్ బ్యాంకు ద్వారా రుణాలు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నామని తెలిపారు. కొండబారిడిలో మహిళా సంఘాలు నడుపుతున్న దంపుడు బియ్యం కేంద్రాన్ని ఆప్కాబ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీవిద్య బృందం సందర్శించింది. నూరు శాతం ప్రకృతి వ్యవసాయ గ్రామంగా ఎలా మార్చుకున్నారో రైతులను అడిగి తెలుసుకొన్నారు.



గుమ్మలక్ష్మీపురం.. ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న ఆప్కాబ్ బృందం

కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ ముఖ్య సలహాదారు డి.పారి నాయుడు, వెలుగు కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు శ్రీను, తిరుపతి, శ్రీరాములు, జట్టు ట్రస్ట్ సిబ్బంది సునీల్, ప్రశాంత్, జీవ ప్రాజెక్ట్ మానిటరింగ్ అధ్యక్షులు తాడంగి జమ్మయ్య, కార్యదర్శి కీలక చిరంజీవి పాల్గొన్నారు.

రాయగడ నుంచి గుంటూరుకు ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీస్ నడపాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రాయగడ నుంచి పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం మీదుగా గుంటూరుకు ఎక్స్‌ప్రెస్ రైలు సదుపాయం కల్పించాలని రైల్వే ప్రయాణికుల సంఘం ప్రతినిధులు మంచుపల్లి శ్రీరాములు, కిశోర్, బిఎన్‌బి రావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రైలు సదుపాయం కల్పిస్తే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వెళ్లడానికి రాత్రి నడిచే విధంగా ప్రజలకు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి తీసుకువస్తే పార్వతీపురం మన్యం, రాయగడ, విజయనగరం జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని రైల్వే అధికారులు పరిశీలించాలని కోరారు. ఎమ్‌పిలు, ఎమ్మెల్యేలు ఈ రైలు సర్వీస్‌పై చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

శరవేగంగా రోడ్డు పనులు

ప్రజాశక్తి-భామిని

మండలంలోని లివిరి కూడలి నుండి మూలగూడ వరకు రెండు కిలోమీటర్ల మేర బిటి రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.1.80 కోట్లతో ఈ రహదారి నిర్మిస్తున్నారు. 200 మీటర్లు సిసి రోడ్డు మినహాయించి, మిగిలినది బిటి రహదారి నిర్మించనున్నట్లు మనిగ సర్పంచ్ కొండ గౌరి చంటి, కాంట్రాక్టర్ సాంబమూర్తి తెలిపారు. ప్రస్తుతం రోడ్డు లేయర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు.



చేపడుతున్న బిటి రోడ్డు పనులు

పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారింది. అభివృద్ధి మాట పక్కన పెడితే కాసుల వసూళ్లలో ముందంజలో ఉందని చెప్పొచ్చు. నగర పంచాయతీలో ఏ పని జరగాలన్నా చేతులు తడపక తప్పదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమిషనర్ స్థాయి అధికారే లంచం తీసుకుంటూ పట్టుబడటమే అందుకు నిదర్శనం. ప్రజలకు అందించాల్సిన సేవలకే పలు శాఖలో అక్రమాలకు పాల్పడుతున్నారు. అధికారుల అడ్డదారి పనులతో నగర పంచాయతీలో అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతోంది.



పాలకొండ.. అక్రమాలకు అడ్డా

- ఇంజినీరింగ్ విభాగంలో కానరాని పర్యవేక్షణ
- పూడికతీత పేరుతో నిధులు స్వాహా!
- టౌన్ ప్లానింగ్ విభాగానికి చెదలు
- తాజాగా ఎసిబి దాడిలో పట్టుబడ్డ కమిషనర్

ప్రజాశక్తి-పాలకొండ

ఇటీవల పాలకొండ నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన విషయం తెలిసిందే. ఈ సంఘటన ప్రజల్లో చర్చనీయాంశమైంది. ధ్రువపత్రాలు మంజూరు నుంచి ఆస్తి పన్నుల మార్పిడి, ప్లాన్లు మంజూరు.. ఇలా చెప్పుకుంటూ పోతే చేంతాడంత ఉంది అక్రమ వసూళ్ల జాబితా. నగర పంచాయతీ కార్యాలయంలో ప్రతీ సేవకు ఓ ధర నిర్ణయించి, వసూళ్లకు పాల్పడుతున్నట్లు బహిరంగంగానే విమర్శలు వస్తున్నాయి. నగర పంచాయతీ పరిధిలో పూడికతీత పనులకు రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయి. అయితే ఈ నిధులతో ఎక్కడా పనులు చేపట్టలేదని చెప్పొచ్చు. పట్టణంలోని లోగుడివీధి, కొండవీధి, బల్లంకివీధి, వేమకోటి వారి వీధి, బడ్డుకొండ వారి వీధి.. ఇలా ఏ ప్రాంతం చూసినా పూడికతీసిన దాఖలాలు లేవు. నగర పంచాయతీలో పూర్తిగా పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. కనీసం కాలువల్లో పూడికతీతలు తీస్తే కొంత ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు భావించినా, అటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇటీవల సిపిఎం బృందం పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ దగ్గర కాలువ పరిశీలించింది. కాలువ అధ్వానంగా ఉందని, దీనివల్ల చుట్టుపక్కల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నగర పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లింది. అయినప్పటికీ, అక్కడ కూడా పనులు చేయలేదు. దీంతో ఆ రూ.30 లక్షల నిధులు ఎక్కడ ఖర్చు పెట్టారు? ఎవరి జేబుల్లోకి వెళ్లాయనే చర్చ పట్టణంలో కొద్దిరోజులుగా సాగుతోంది. ఇంజినీరింగ్ విభాగంలో చేపడుతున్న పనుల్లో డొల్లతనం కనిపిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పాలకొండ నగర పంచాయతీపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.



పూడిక తీయకపోవడంతో అధ్వానంగా ఉన్న కాలువ

అనుమతులు లేకుండానే నిర్మాణాలు

నగర పంచాయతీలో టౌన్‌ప్లాన్ విభాగానికి చెదలు పెట్టాయని చెప్పొచ్చు. రెగ్యులర్ టౌన్ ప్లానింగ్ అధికారులు లేకపోవడంతో సచివాలయంలో ఉన్న కార్యదర్శులే పర్యవేక్షిస్తున్నారు. దీంతో అక్రమ నిర్మాణాలు ఇష్టానుసారంగా చేపడుతున్నారు. ఈ విభాగంలో అక్రమాలపై బహిరంగంగానే ఆరోపణ వినిపిస్తున్నాయి. నిబంధనలకు పాతరేసి ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు నిర్మాణాలు చేపడుతున్నా కనీస చర్యలు లేవు. నగర పంచాయతీ నుంచి ప్లాన్లు కూడా ఆమోదం తెలపకుండానే భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిసింది. సుడా అనుమతులు కూడా పొందాల్సి ఉన్నా, అవేవీ పట్టించుకోకుండా పెద్ద పెద్ద భవనాలు నిర్మిస్తున్నట్లు సమాచారం. పట్టణంలో పలు భవన నిర్మాణాలు పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతోంది. వేమకోటవారి వీధిలో కొంతమంది వ్యక్తులు నాలుగు అంతస్తుల భవనాలు నిర్మించుకున్నారు. దీనికి నగర పంచాయతీ నుంచి ప్లాన్ కూడా మంజూరు కాలేదు. సచివాలయం నుంచి కూడా అనుమతులు లభించలేదు. ఇష్టారాజ్యాంగ నిర్మాణాలు చేస్తున్నట్లు తెలిసింది. నిర్మాణ ప్రాంతంలో నగర పంచాయతీకి పది శాతం స్థలం కూడా కేటాయించాల్సి ఉన్నా అవేవీ పట్టించుకోలేదు. అధికారులు ఉదాసీనతతో వ్యవహరిస్తుండడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ప్రజాశక్తి - వంగర

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాలలో పదవ తరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించడమే తమ లక్ష్యమని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాల సమన్వయకర్త శంభాన రూపవతి అన్నారు. ఈ మేరకు ఆమె మండలంలోని మడ్డువలసలో గల గురుకులంను బుధవారం పరిశీలించారు. విద్యార్థినిలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పరీక్షల సమయం దగ్గర పడుతుందని అందరూ చక్కగా చదువుకొని మంచి ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు గురుకులంకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గురుకులంలో రికార్డులు తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి విద్యార్థినిలతో కలిసి భోజనం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల అంబేద్కర్ గురుకులాలలో 13 గురుకులాలకు సంబంధించి 10వ తరగతిలో 930 మంది విద్యార్థులు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 670 మంది, ద్వితీయ సంవత్సరంలో 530 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ఉపాధ్యాయులు పర్యవేక్షణలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

గురుకులాల ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త రూపవతి



సుదూర ప్రాంతాల నుంచి నీటిని తెస్తున్న మహిళలు

ఏజెన్సీ గొంతెండుతోంది!

120 గ్రామాలకు పైగా నీటి ఎద్దడి ● వేసవికి ముందే తాగునీటికి కటకట

ఏజెన్సీలో గిరిజనులను తాగునీటి సమస్య వెంటాడుతోంది. ఫిబ్రవరి నెలకే భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. గెడ్డలు, వాగులు ఎండిపోతున్నాయి. బోర్లు ఎంత కొట్టినా నీరు పడటం లేదు. గుక్కెడు నీటి కోసం గిరిజనులు తహతహలాడుతున్నారు. కొన్ని గ్రామాల్లో బిందెడు నీటి కోసం కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి పరిస్థితి నెలకొంది. మరికొన్ని గ్రామాల్లో అదే బిందు కోసం పడిగాపులు పడాల్సి వస్తోంది. వేసవి ఆరంభం కాకముందే ఇలా ఉంటే, ఇక ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఏజెన్సీ పరిధిలో సుమారు 120 గ్రామాల వరకు నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికే సరిహద్దు గూడ, జెపిబూర్జిగూడ, దిగువ దుంబంగివలస, చావిడి వలస, తెలేబుగూడ ఈతమానుగూడ, నీలంగూడ, పెద్దగూడతోపాటు పోల్ల, దోనుబాయి పరిసర ప్రాంతాల్లో 20 గ్రామాల వరకు తాగునీటి సమస్య ఉందని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు విన్నవించినట్లు తెలిసింది. సీతంపేట మండలంలో 40 గ్రామాల్లో నీటి ఎద్దడి ఉన్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గుర్తించి, రూ.86.55 లక్షలతో ప్రతిపాదనలు పంపించినట్లు సమాచారం.

- దోనుబాయి గ్రామంలో 500 కుటుంబాలు ఉన్నాయి. ఐదు బోర్లు ఉన్నప్పటికీ నీరు అందడం లేదు. రెండు బావులు ఉన్నప్పటికీ అడుగంటి పోవడంతో నీరు చాలడం లేదని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.
- సీతంపేట ఐటిడిఎకు కూతవేటు దూరంగా ఉన్న కంబగూడులో బోరు నుంచి మోటార్ ద్వారా రక్షిత మంచినీటి పథకానికి నీరు పంపిస్తున్నారు. అయితే మోటారు మరమ్మతుకు గురవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.
- నాయకమ్మగూడ గ్రామంలో 50 కుటుంబాలు నివశిస్తున్నాయి. ఉన్న ఒక్క బోరు నుంచి నీరు తక్కువగా వస్తోంది. ఉన్న బావి అడుగంటి పోయింది. నీరు సరిపోకపోవడంతో గతంలో పిఒ రాహుల్ కుమార్ రెడ్డి గ్రామాన్ని సందర్శించి మోటార్ బోరు ఇస్తామన్నారు. కానీ ఆ సమస్య పరిష్కారం కాలేదు.
- దుగ్గి పంచాయతీ చాపరాయి గూడలో 40 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. బావి ఉన్నప్పటికీ నీరు చాలడం లేదు. గ్రావిటేషన్ ఫ్లో నీరు కూడా చాలడం లేదు. కిలోమీటర్ దూరంలో ఉన్న చిన్నపాటి బావి నుంచి గిరిజనులు ఒకరు తర్వాత ఒకరు నీరు పట్టుకుని తెచ్చుకుంటూ గొంతు తడుపుకుంటున్నారు.
- పెద్దగూడ పంచాయతీ లంబ గూడలో 25 కుటుంబాలు ఉన్నాయి. ఉన్న బావి అడుగంటి పోయింది. ఒక్క బోరు కూడా లేదు. దీంతో ఫిబ్రవరి నుంచి తాగునీటి కష్టాలు ఆరంభమయ్యాయి. బోరు మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



ఎండిపోతున్న గెడ్డ

- దేవనాపురం పంచాయతీ సుంద్ర నాయుడు గూడలో 47 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఉన్న బావికి మోటార్ ఉంది. కరెంటు లేనప్పుడు ఇబ్బంది తప్పడం లేదు. సోలార్ పనిచేయడం లేదు. వాటర్ ట్యాంకు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు
- పక్క జంతిగూడలో 10 కుటుంబాలు ఉన్నాయి. బావిబోరు లేదు. ఎత్తయిన కొండపై ఈ గ్రామం ఉంది. దీంతో కొండపై నుంచి కిందికి కిలోమీటర్ దూరం నడిచి జగత్ పల్లి బావికి వచ్చి నీరు తీసుకొని వెళ్తున్నారు. ఈ వేసవిలో రెండు గ్రామాల గిరిజనులు జగత్ పల్లి బావినీరు తాగుతున్నారు.
- పివి ఈతమానుగూడ పంచాయతీ నెల్లిగండిలో 15 కుటుంబాలు ఉన్నాయి. ఎత్తయిన కొండలపైన గ్రామం ఉండటంతో బోర్లు లేవు. 200 మీటర్ల దూరంలో బావి ఉన్నప్పటికీ నీరు అందకపోవడంతో మోటార్ కాలిపోయింది. బావిలో నీరు అందకపోతే గెడ్డ నీటిపై ఆధార పడాల్సి వస్తుంది. వేసవిలో ఆ నీరు చాలదని గ్రామస్తులు వాపోతున్నారు.
- పెద్దగూడలో రెండు రక్షిత మంచినీటి పథకాలు ఉన్నప్పటికీ నీరు చాలడం లేదు. మరొక ట్యాంకు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.
- ఎగువ దారబలో నీటి సమస్య అధికంగా ఉంది. రెండున్నర కిలోమీటర్ల దూరం ఉన్న రసూల్‌పేట కొండపై నుంచి రసూల్‌పేటకు దిగి బావి నుంచి నీరు తీసుకువెళ్తారు. అయితే భవి నుంచి కొండపైన ఉన్న ఎగువ దారబకు మోటార్ బిగించినప్పటికీ నీరు రావడం లేదు.


తాగునీటి సమస్య పరిష్కరించండి



సుంద్రునాయుడు గూడలో సోలార్ పనిచేయడం లేదు. దీంతో నీరు రావడం లేదు. వెంటనే అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలి. గ్రామంలో మరో ట్యాంకు ఏర్పాటుచేయాలి.

- సవర మోజెస్, గిరిజనుడు, సుంద్రునాయుడుగూడ

ట్యాంకర్ల ద్వారా నీరందించాలి



దోనుబాయి గ్రామంలో రక్షిత మంచినీటి పథకానికి మరమ్మతులు చేయాలి. కొత్తగా రక్షిత మంచినీటి పథకం మంజూరు చేయాలి. వేసవి కాలంలో నీరు సరిపోవడం లేదు. పెళ్లిళ్లు, పండగలు, ఫంక్షన్లకు ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలి.

- కూరంగి వెంకినాయుడు, సర్పంచ్, దోనుబాయి

అధికారులకు తెలియజేశాం



దోనుబాయి, పొల్ల, మానాపురం, దుగ్గి పరిసర ప్రాంతాల్లో 20 గ్రామాలకు పైగా తాగునీటి సమస్య ఉందని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ద్వారా కలెక్టరుకు పంపించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలి.

- బిడ్డిక ఆదినారాయణ, ఎంపిపి, సీతంపేట

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తాం. ఇప్పటికే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను అప్రమత్తం చేశాం. యాక్షన్ ప్లాన్ తయారు చేసి ప్రతిపాదనలు పంపించాం. కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లాం.

- సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, ఐటిడిఎ పిఒ, సీతంపేట

కిటకిటలాడిన శివాలయాలు

పారమ్మకొండ, గుంప సోమేశ్వర ఆలయాలకు పోటెత్తిన యాత్రికులు ● కుటుంబంతో కలిసి పూజలు చేసిన మంత్రి సంధ్యారాణి



కొమరాడ.. గుంప సోమేశ్వర ఆలయం వద్ద క్యూలో బారులు తీరిన యాత్రికులు

ప్రజాశక్తి-పాచిపెంట

మహాశివరాత్రి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శివాలయాలు బుధవారం కిటకిటలాడాయి. పాచిపెంట మండలం పనుకువలస పంచాయతీ పెద్దచీపురువలస సమీపంలోని పారమ్మకొండ వద్ద శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్తరాంధ్రతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో యాత్రికులు పోటెత్తారు. పారమ్మకొండ దిగున నిర్మించిన ఆలయంలో ముందుగా పూజలు చేసి, అనంతరం మెట్ల మార్గాన కొండపైకి చేరుకున్నారు. అక్కడ పారమ్మతల్లి విగ్రహాన్ని దర్శించుకున్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సాలూరు పట్టణానికి చెందిన పలు స్వచ్ఛంద సేవా సంస్థలు యాత్రికులకు భోజనాలు, అల్పాహారం, మజ్జిగ, పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశాయి. తాగునీటి సౌకర్యం కల్పించాయి. సాలూరు డిపో నుంచి పారమ్మకొండకు 25 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. సాలూరు రూరల్ సిఐ పి.రామకృష్ణ, పాచిపెంట ఎస్ఐ వెంకట సురేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పాచిపెంట తహశీల్దార్ డి.రవి, ఆలయ ఇఒ రమేష్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొమరాడ : మహాశివరాత్రి సందర్భంగా గుంప సోమేశ్వర స్వామి ఆలయానికి యాత్రికులు పోటెత్తారు. జంఝావతి, నాగావళి నదుల సంగమంలో వెలిసిన గుంప సోమేశ్వర ఆలయానికి పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు ఒడిశా, పార్వతీపురం, బొబ్బిలి తదితర ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. నదిలో రాకపోకలు సాగించి, స్నానాలు చేసుకుని, ఆలయాన్ని సందర్శించారు. ఆలయాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, అడ్డాకుల సన్యాసినాయుడు దంపతులు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తాగునీటి బాటిళ్లు పంపిణీ చేశారు. ఎస్ఐ కె.నీలకంఠం ఆధ్వర్యాన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వైద్యాధికారి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు సందర్శించారు.



పాచిపెంట.. ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి



పాచిపెంట.. పారమ్మకొండపైకి వెళ్తున్న యాత్రికులు

పార్వతీపురంరూరల్ : మండలంలో అడ్డాపుశీల శివాలయాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని పరిశీలించారు. పెదబొండపల్లి, చిన్నబొండపల్లి, నర్సిపురం, సూడిగం, తాళ్లబురిడి, బందలుప్పి, ఎంఆర్ నగరం, సంగం వలస గ్రామాల్లోని ఆలయాలకు యాత్రికులు పోటెత్తారు.

కురుపాం : మండలంలోని గుమ్మ గ్రామంలో నీలకంఠేశ్వర స్వామిని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కె.వి.కొండయ్య, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతమ్మ, ఎఎంసి మాజీ ఛైర్మన్ కోలా రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : మండలంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయం, అన్నవరంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం, కోమటిపేట సెంటర్‌లో సేనారి విశ్వేశ్వర స్వామి ఆలయం, కోటిపల్లిలో కొండమీద ఉన్న శివాలయం, నక్కలపేటలో ఉన్న శివాలయంలో శివరాత్రి సందర్భంగా రద్దీ ఎక్కువగా కనిపించింది.

సీతంపేట : మండలంలో సీతంపేట కాశీ విశ్వేశ్వర స్వామి, పులిపుట్టి బూలింగేశ్వర, కన్నధార కొండ శివాలయాల్లో భక్తులు బారులు తీరారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలో ఉన్న కాశీవిశ్వేశ్వర, ఉమామార్కండేయ, వింధ్యవాసిని నగరేశ్వర, ఈశానేశ్వర, భ్రమరాంబిక మల్లికార్జున ఆలయాలు తెల్లవారు నుండే భక్తులతో కిటకిటలాడాయి.

గరుగుబిల్లి : మండలంలో బురదవెంకటాపురంలో జగదీశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కళ్యాణం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ బొత్స లక్ష్మి, మాజీ సర్పంచ్ బొత్స జోగి నాయుడు, మాజీ ఎంపిటిసి బొత్స భూలక్ష్మి, బొత్స శ్రీరాములునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంతోపాటు వండువా, బిటివాడ, తలవరం, దశమంతపురం, కంబర, తదితర గ్రామ శివాలయాలు కిటకిటలాడాయి.





కురుపాం.. ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దంపతులు ; పార్వతీపురంరూరల్.. అడ్డాపుశీల ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన డిఎస్‌పి

ప్రజాశక్తి-సీతంపేట

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సీతంపేట బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు బుధవారం సందర్శించారు. విద్యుత్తు, తాగునీటి వసతులను పరిశీలించారు.

సీతానగరం : సీతానగరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రానికి బుధవారం పోలింగ్ సామగ్రితో సిబ్బంది చేరుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జె.ప్రశాంత్ కుమార్, ఎస్ఐ ఎం.రాజేష్, ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. మండల వ్యాప్తంగా 120 ఓట్లు ఉన్నాయని, ఇందులో పురుషులు 85, స్త్రీలు 35 మంది ఉన్నట్లు ఎన్నికల సిబ్బంది తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

ప్రజాశక్తి-కొమరాడ

వేసవిని దృష్టిలో పెట్టుకొని గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం కొమరాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే అనేక గిరిజన గ్రామాల్లో నీటికొరత ఉందన్నారు. వెంటనే ఐటిడిఎ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన ముందస్తుగా తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు ప్రసాదు, చెంబరు పాల్గొన్నారు.

నేడు దుగ్గేరులో వైద్య శిబిరం

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని పనసభద్ర పంచాయతీ దుగ్గేరులో గురువారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మక్కువ ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. గురువారం దుగ్గేరు వారపు సంత కూడా జరగనున్న నేపథ్యంలో వైద్య శిబిరం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ కోరారు.

ప్రయివేటు స్కూళ్ల ఇష్టారాజ్యం

●బస్సులలో పరిమితికి మించి విద్యార్థుల తరలింపు ● అనుమతి లేకుండా వసతి గృహాల నిర్వహణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా మండలంలో ఇప్పటికే పలు ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. మరికొన్ని పాఠశాలలు మూసివేత దిశగా ఉన్నాయి. దీన్ని ఆసరాగా తీసుకుని మండలంలో ఇప్పటికే 17 ప్రైవేట్ పాఠశాలలు ఒక అనుమతులు లేని ప్లే స్కూలు ఉన్నాయి. ప్రయివేటు స్కూళ్ల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతునే ఉంది. ఇక్కడ ప్రైవేట్ స్కూళ్ల విద్యా వ్యాపారంపై ప్రశ్నించే వారే లేకపోవడమే దీనికి కారణం.



పరిమితికి మించి బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులు

మండలంలోని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు స్కూళ్ల నిర్వహణలో తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అనుమతులు లేని బస్సులలో సీట్ల పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా స్కూల్లల్లో హాస్టల్స్ నిర్వహిస్తున్నారు. విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తూ బుక్స్, యూనిఫామ్, షూ, బెల్ట్స్ వంటివి స్కూళ్లలోనే అమ్మకాలు సాగిస్తున్నారు. ఇవన్నీ మండల విద్యాశాఖ అధికారికి తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదు. తన కళ్ళ ముందే ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాలు విద్యాహక్కు చట్టాలను ఉల్లంఘిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై భారాలు వేస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ విషయమే ఎంఇఒ నర్సింగరావు వద్ద ప్రజాశక్తి ప్రశ్నించగా ప్రైవేటు స్కూళ్ల విషయంలో తానేమి చేయలేనని జిల్లా విద్యాశాఖ అధికారులే చర్యలు తీసుకోవాలని చెప్పారు. పైగా మీరు నాకు తెలియజేశారు కదా చూస్తానులే అంటూ నిర్లక్ష్యపు సమాధానం చెప్పారు. ఆ వెంటనే 'మీ ప్రైవేటు స్కూళ్ల నిర్వహణ బాగోలేదంటూ ఫిర్యాదులు చేస్తున్నారని ప్రైవేట్ స్కూలు యజమానులకు ఫోన్ చేసి మరి ఆయనే చెప్పడం విడ్డూరంగా ఉంది. జిల్లా యంత్రాంగం స్పందించి ఇక్కడ ఎంఇఒతో పాటు ప్రయివేటు స్కూళ్ల యాజమానులపై చర్యలు తీసుకోవాలని పలువురు పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.



కేంబ్రిడ్జి స్కూల్ అనుమతులతో నిర్వహిస్తున్న నారాయణ స్కూల్



మజ్జిగ పంపిణీ చేస్తున్న సిఐటియు నాయకులు ఎన్‌వై నాయుడు

మజ్జిగ వితరణ

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మహాశివరాత్రి సందర్భంగా పారమ్మ కొండకు వెళ్లే యాత్రికులకు సాలూరు ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద బుధవారం శివ శంకర్ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మజ్జి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ సేవాభావం చాటుకున్న ఆటో యూనియన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో శివశంకర్ ఆటో యూనియన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గులి పద్ధతిలో చోడి సాగు

ప్రజాశక్తి-పాచిపెంట



గులి పద్ధతిలో చోడిపంట వేయిస్తున్న ఎఒ తిరుపతిరావు

మండలంలోని పి.కోనవలస గ్రామంలో రైతు గునాపు రామారావు పొలంలో ప్రకృతి సేద్య సిబ్బంది విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గులి పద్ధతిలో చోడి పంట వేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు గులి పద్ధతిలో చోడి పంట పండించే విధానాన్ని వివరించారు. సాధారణ పద్ధతి కంటే గులి పద్ధతిలో రెట్టింపు చోడి దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్య సిబ్బంది సురేష్, తిరుపతి నాయుడు, కుమార్, సుమలత పాల్గొన్నారు.

చీటీల నిర్వాహకుడు అరెస్టు

ప్రజాశక్తి - భోగాపురం

చీటీలు, అప్పుల పేరిట ప్రజలను మోసం చేసి కుటుంబంతో పరారైన మోసగాడిని పోలీసులు పట్టుకొని అతనితో పాటు అతని భార్యను కూడా అరెస్ట్ చేసి బుధవారం కోర్టుకు తరలించారు. భోగాపురం గ్రామానికి చెందిన తిరుమరెడ్డి మురళి గ్రామంలో గత కొన్నాళ్లుగా చీటీలు నిర్వహించేవాడు. అనేకమంది వద్ద అప్పులు కూడా చేశాడు. గతేడాది అక్టోబర్ నెలలో తనకు ముగ్గురు వ్యక్తులు మోసం చేశారని లేఖ రాసి ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించాడు. దీంతో ఆసుపత్రిలో జాయిన్ చేశారు. కానీ ఆస్పత్రి నుంచే పరారయ్యేందుకు ప్రయత్నించడంతో చీటీలు, అప్పుల బాధితులు ఆసుపత్రిలోనే కాపలా కాయాల్సిన పరిస్థితి వచ్చింది.

అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టడంతో బాధితులు కూడా నిలదీశారు. అందరికీ డబ్బులు చెల్లిస్తానని చెబుతూనే మూడు నెలల కిందట ఇద్దరు పిల్లలు, భార్య, తల్లితో కలిసి పరారయ్యాడు. దీంతో బాధితులు ఆందోళనకు గురయ్యారు. చివరకు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు సిఐ ఎన్.వి ప్రభాకర్ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించారు. రాజమండ్రిలో ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు మంగళవారం వెళ్లి ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. రాజమండ్రి నుంచి మురళితోపాటు అతని భార్య తులసినీ బుధవారం ఇక్కడకు తీసుకువచ్చి ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ పాపారావు తెలిపారు.